
సాక్షి గుంటూరు

సోమవారం । 11 । నవంబర్ । 2024



నిత్యాన్నదానానికి విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన భక్తులు సట్లూరి కావ్య, రాఘవేంద్ర రూ. లక్ష విరాళాన్ని అందజేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 587.20 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడి కాలువకు 10,120 క్యూసెక్కులు వదిలారు.



కార్తిక దీపోత్సవం

మోపిదేవి: కార్తికమాసం సందర్భంగా వల్లీదేవ సేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం కార్తిక దీపోత్సవం వైభవంగా నిర్వహించారు.

న్యూస్‌రీల్

ఆరుగురు ఎస్‌ఐలకు అటాచ్‌మెంట్

నగరంపాలెం: జిల్లాలో వీఆర్‌లో ఉన్న ఆరుగురు ఎస్‌ఐలకు అటాచ్‌మెంట్ కింద పోస్టింగ్‌లు కల్పిస్తూ జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్‌ఐలు ఎ.శివకృష్ణ రావుకు అరండల్‌పేట పీఎస్, బి.విజయకు మార్‌రెడ్డికి సోషల్ మీడియా, సైబర్ క్రైం సెల్, పి.రబ్బానీకి నగరంపాలెం పీఎస్, ఎ.శ్రీనివాసరెడ్డికి తూర్పు ట్రాఫిక్ పీఎస్, పి.అనిల్‌కుమార్‌రెడ్డికి పశ్చిమ ట్రాఫిక్, ఎల్.రాములును సీసీఎస్‌కు బదలాయించారు. ఈ నెల 5న వీఆర్‌లో ఉన్న ముగ్గురు ఎస్‌ఐలకు పోస్టింగ్‌లు కల్పిస్తూ ఉత్తర్వులు వెలువడగా, తర్వాత వాటిని రద్దు చేశారు. అనంతరం కొత్తగా ఆరుగురు ఎస్‌ఐలకు అటాచ్‌మెంట్ కింద పోస్టింగ్‌లు కల్పించారు.

కార్తిక దీపోత్సవం




సత్తెనపల్లి: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట గల వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి గోశాలలో ఇస్కాన్ నరసరావుపేట ఆధ్వర్యంలో శ్రీ శ్రీ దామోదర కార్తిక దీపోత్సవం ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత గోమాత పూజ, అనంతరం శ్రీ శ్రీ దామోదర కార్తిక దీపోత్సవం వైభవంగా నిర్వహించారు. వైష్ణవ ప్రభు ప్రత్యేక ప్రవచనం చేశారు. భక్తులు తమ స్వహస్తాలతో దామోదరునికి హారతినిచ్చే సేవ చేపట్టారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై శ్రీశ్రీ దామోదర మహాద్భాగ్యం పొందారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఇస్కాన్ భక్త బృందం ఏర్పాట్లను పర్యవేక్షించింది.

పోలీసుల తనిఖీలు

పట్నంబజార్: గుంటూరు వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలోని వెస్ట్ ట్రాఫిక్ పోలీసులు ఆదివారం సాయంత్రం గుంటూరు నగరంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా స్నేక్ డ్రైవ్, రాష్ డ్రైవ్, సైలెన్సర్లు తీసివేసి తిరుగుతున్న వాహనదారులను పట్టుకున్నారు. వెస్ట్ ట్రాఫిక్ సీఐ సింగయ్య ఆధ్వర్యంలో మొత్తం నాలుగు బైకులు స్వాధీనం చేసుకుని, చోదకులకు జరిమానాలు విధించారు.

సాగునీటి సమాచారం



తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద ఆదివారం 6830 క్యూసెక్కులు విడుదల చేశారు. హైలెవల్ కాలువకు 316 క్యూసెక్కులు, బ్యాంక్ కెనాల్‌కు 1711 క్యూసెక్కులు, తూర్పు కెనాల్‌కు 682 క్యూసెక్కులు, పశ్చిమ కెనాల్‌కు 187 క్యూసెక్కులు, నిజాంపట్నం కాలువకు 440 క్యూసెక్కులు, కొమ్మమూరు కాలువకు 3060 క్యూసెక్కులు విడుదల చేశారు.

నేటి నుంచి భవానీ దీక్షలు

15 వరకు మండల దీక్షల స్వీకరణకు ఏర్పాట్లు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ భవానీ దీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మండలం పాటు దీక్షలను ఆచరించే భక్తులు సోమవారం తెల్లవారుజాము నుంచి 15వ తేదీ వరకు దీక్షలను స్వీకరించనున్నారు. భక్తులు భవానీ దీక్షలను స్వీకరించేందుకు మహా మండపం ఆరో అంతస్తులో ఉత్సవ మూర్తి వద్ద, ఘాట్‌రోడ్డు ఆరంభంలోని కామధేను అమ్మవారి ఆలయం వద్ద దేవస్థానం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. సోమవారం తెల్లవారుజామున భక్తులు పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం అమ్మవారి ఆలయంతో పాటు గురు భవానీల పీఠాల వద్ద దీక్షలను స్వీకరించవచ్చునని ఆలయ వైదిక కమిటీ సభ్యులు రంగావజ్జుల శ్రీనివాసశాస్త్రి చెప్పారు. భవానీ దీక్షల ప్రారంభాన్ని పురస్కరించుకుని సోమవారం ఉదయం అమ్మవారి ఉత్సవ మూర్తికి ప్రధాన ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ మహా మండపం ఆరో అంతస్తు వరకు ఊరేగింపుగా తీసుకెళ్లనున్నారు. ఆరో అంతస్తులో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై అమ్మవారు అధిష్టించిన అనంతరం పూజలు, అఖండ జ్యోతి ప్రజ్వలన చేస్తారు. తర్వాత భక్తులకు దీక్షాధారణ నిర్వహిస్తారు.

లీజ్ అగ్రిమెంట్‌లు ఉండవు... అనుమతులు అంతకన్నా ఉండవు.. అధికారం ఉంది కదా అని ఇష్టం వచ్చినట్లు తవ్వుకోవడం, విక్రయించడం... ఇదీ గుంటూరు రూరల్, మేడికొండూరు మండల్లాల్లోని కంకర క్వారీల్లో జరుగుతున్న తంతు. కనీస భద్రతా ప్రమాణాలు కూడా లేవు. ప్రమాదకరమైన పరిస్థితుల్లో అక్కడి కార్మికులు పనులు చేస్తున్నారు. ఎవరైనా మృతి చెందినా, గాయపడినా విషయం బయటకు రాకుండా చేయడం నిర్వాహకులకు అలవాటుగా మారింది. ఇంత జరుగుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది.



పేరేచర్లలోని కంకర క్వారీ

యథేచ్ఛగా పచ్చ మైనింగ్!

- కనీస అనుమతులు లేకుండా క్వారీల నిర్వహణ
- మచ్చుకైనా కనిపించని భద్రతా ప్రమాణాలు
- కార్మికుల ప్రాణాలు పోతున్నా పట్టించుకోని యంత్రాంగం
- తమ్ముళ్ల కాసుల కక్కుర్తితో పర్యావరణానికీ విఘాతం

సాక్షి ప్రతినిధి, గుంటూరు: గుంటూరు రూరల్, మేడికొండూరు మండలాల్లో ఫారెస్ట్, ప్రైవేటు, సొసైటీ.. ఇలా ఏ క్వారీలైనా ఇష్టారాజ్యంగా బ్లాస్టింగ్‌లు చేపడుతున్నారు. కొండలలో ఇలా చేస్తున్న క్వారీల సమీపంలోనే రాష్ట్ర ప్రధాన రహదారులు, పాఠశాలలు ఉన్నాయి. ప్రయాణికులు, విద్యార్థుల రక్షణను కూడా గాలికి వదిలేస్తున్నారు. అధికారంలో ఉన్నామనే ధీమాతో అనుమతులు ఎందుకు అన్నట్లు కూటమి నేతలు వ్యవహరిస్తూ అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్నారు.

భద్రత మాటే లేదు...

క్వారీని నిర్వహించాలంటే తప్పనిసరిగా అనుసంధానంగా లైసెన్స్ కలిగిన బ్లాస్టర్ ఉండాలి.

అధికారం అండతో అడ్డగోలుగా తవ్వకాలు

పేరేచర్ల గ్రామం, రూరల్ మండలం పరిధిలో సుమారు 150కి పైగా రాళ్ల క్వారీలు నడుస్తున్నాయి. కానీ లైసెన్స్ కలిగిన బ్లాస్టర్ ఒక్కరూ కనిపించరు. క్వారీలో పనిచేసే కార్మికులకు సేఫ్టీ రోప్స్, హెల్మెట్స్, బూట్లు, చేతికి గ్లౌవ్స్ వంటి భద్రతా సామగ్రి ఇవ్వాలి. ఇవేమీ లేకుండానే అంత ఎత్తులో కార్మికులు పనిచేయాల్సిందే. బ్లాస్టింగ్ నిర్వహించాలంటే ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉదయం 6 లోపు, సాయంత్రం 6 గంటల తరువాత మాత్రమే అనుమతి ఉంది. కానీ ఈ క్వారీల్లో నిత్యం బ్లాస్టింగ్‌లు కొనసాగుతూనే ఉన్నాయి. కంకర రాళ్ల క్వారీలలో కొండలపైకి ఎక్కి రాళ్లను నూర్పిడి చేసే సమయంలో ప్రతి కార్మికుడు జాకెట్లు, హెల్మెట్లు వంటి భద్రతా పరికరాలు ఉపయోగించాలి. ఇక్కడ వాటిని వాడిన దాఖలాలు లేవు.

యంత్రాంగం వత్తాసు

మేడికొండూరు మండలం పేరేచర్ల పరిధిలోని రాళ్ల క్వారీలకు అనుమతులు లేకపోయినా తవ్వకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. అధికార పార్టీ నాయకులకు యంత్రాంగం వత్తాసు పలుకుతోంది. వారు చెప్పినట్లు అధికారులు తలలు ఊపుతున్నారు. పేరేచర్ల గ్రామ పరిధిలో రెవెన్యూ పరంగా సర్వే నెంబర్ 473లో మూడు ఎకరాలు, 379లో 21 ఎకరాల విస్తీర్ణంలో రెండు కంకర రాళ్ల క్వారీలు ఉన్నాయి. వీటిని తెలుగు తమ్ముళ్లు గతంలో లీజుకు తీసుకున్నారు. తర్వాత గడువు పూర్తి అయినా అనుమతులు లేకుండానే తవ్వకాలు జరుపుతున్నారు. ఇక్కడి కార్మికుల జీవితాలు అగమ్యగోచరంగా మారుతున్నాయి. కనీస అనుమతులైన ఎన్‌ఓసీలను కూడా తీసుకోకుండా పనులు చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ప్రాణాలు పోతున్నా పట్టింపేదీ?

వందల అడుగుల ఎత్తైన కొండలపైకి కార్మికులు ఎక్కుతున్నప్పుడు జారి పడితే ప్రాణాలు గాల్లో కలిసిపోవడమే. ఇప్పటికే కొందరు కార్మికులు మృతి చెందిన ఘటనలు కూడా ఉన్నాయి. రెండు నెలల క్రితం క్వారీలో పని చేస్తూ ఒడిశాకు చెందిన కార్మికుడు జారి పడి సంఘటన స్థలిలోనే చనిపోయాడు. నెల రోజుల క్రితం చిన్నపలకలూరు గ్రామానికి చెందిన కార్మికుడు కూడా రాళ్లు పడి మృతి చెందాడు. వారం క్రితం పేరేచర్లకు చెందిన అధికార పార్టీ నాయకుడికి చెందిన క్వారీలో రాళ్లు జారి పడి మరో కార్మికుడు ప్రాణాలు కోల్పోయాడు. ఇలా ఎన్ని దుర్ఘటనలు జరిగినా ఒక్క అధికారి కూడా అటు వైపు కనీసం కన్నెత్తి చూడలేదు. వారికి ప్రతి నెల మామూళ్లు అందడమే దీనికి కారణమనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు క్వారీలపై నిఘా పెట్టాల్సిన అవసరం ఉంది. కార్మికుల భద్రత కోసం జాగ్రత్తలు పాటించేలా చూడాలి. అటు అడ్డగోలు మైనింగ్ వల్ల పర్యావరణానికి జరుగుతున్న నష్టాన్ని నివారించాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వానికి నిబంధన ప్రకారం ఆదాయం వచ్చేలా చూడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులదే.

పొలిటికల్ బాస్‌ల కోసం పనిచేస్తున్న పోలీస్ బాస్

- మాకూ ఓ రోజు వస్తుంది.. ఏ ఒక్కరినీ వదలిపెట్టబోం
- మాజీ మంత్రి విడదల రజిని



పట్నంబజారు: "పోలీసు బాస్... పొలిటికల్ బాస్‌ల కోసం పనిచేస్తున్నారు. తమ పరిధి దాటి పోలీసులు వ్యవహరిస్తున్న తీరు దారుణం. గుర్తుపెట్టుకోండి.. మాకూ ఒక రోజు వస్తుంది. కచ్చితంగా ఏ ఒక్కరినీ వదలిపెట్టబోమని" మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చిలకలూరిపేట నియోజకవర్గ సమన్వయకర్త విడదల రజిని స్పష్టం చేశారు. శ్యామలానగర్‌లోని తన నివాసంలో ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా చంద్రబాబు నీచ రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. వైఎస్సార్ సీపీకి సంబంధించిన సోషల్ మీడియా యాక్టివిస్టులు, సానుభూతిపరులు, అభిమానులపై అక్రమ కేసులు పెట్టి వేధింపులకు గురిచేయటంపై ఆవేదన వ్యక్తం చేశారు. చిలకలూరిపేటకు చెందిన పెద్దిరెడ్డి సుధారాణి, ఆమె భర్త వెంకటరెడ్డిలను అక్రమంగా అరెస్ట్ చేశారన్నారు. సిరిసిల్ల నుంచి బలవంతంగా తీసుకొచ్చి చిలకలూరిపేట టౌన్ స్టేషన్‌లో అక్కడి సీఐ టార్చర్ చేయటంపై మండిపడ్డారు. న్యాయస్థానంలో ఆమె ఆవేదన వినేందుకు గంట సమయం కేటాయించారంటే.. పరిస్థితి అర్థం చేసుకోవచ్చన్నారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వారి కుటుంబసభ్యులు, తమపై సోషల్ మీడియా వేదికగా వ్యక్తిగత హననం చేస్తుంటే.. ఫిర్యాదులు చేసినా పట్టించుకోకపోవటం సిగ్గుచేటన్నారు. తాను స్వయంగా సాక్ష్యాధారాలతో ఫిర్యాదు చేసినా డీజీపీ, ఎస్పీ ఇంతవరకు స్పందించకపోవటంపై ప్రశ్నించారు. చట్టం మీకు ఒకలా.. మాకు ఒకలా ఉంటుందా? అని నిలదీశారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్పష్టంగా లా అండ్ ఆర్డర్ రాష్ట్రంలో ఎలా ఉందో చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. బాధితులకు జగనన్న, తాము అండగా ఉంటామన్నారు.



మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

అటవీ అమర వీరుల త్యాగాలను
వృథా కానివ్వం

- వారి కుటుంబాలకు అండగా ప్రభుత్వం నిలుస్తుంది
- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

గుంటూరు ఎడ్యుకేషన్: అటవీ సంపద దోచుకునే వారిని ధైర్యంగా ఎదుర్కొని ప్రాణాలర్పించిన అటవీ అధికారులు, ఉద్యోగుల త్యాగాలను వృథా కానివ్వబోమని ఉప ముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ అన్నారు. గుంటూరులోని జిల్లా కలెక్టర్ బంగ్లారోడ్డులో ఉన్న అరణ్య భవన్‌లో ఆదివారం జరిగిన అటవీ అమర వీరుల సంస్మరణ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించిన అనంతరం జరిగిన సభలో మాట్లాడుతూ.. అటవీ సంపద పరిరక్షణలో ఒక ఐఎఫ్ఎస్ అధికారితోపాటు 23 మంది సిబ్బంది తమ అమూల్యమైన ప్రాణాలు కోల్పోయారని గుర్తుచేశారు. వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. అమరవీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని, ప్రకృతి సంపదను భవిష్యత్తు తరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేద్దామని అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చెప్పినట్లు మనది వసుధైక కుటుంబమని, భూమిపై మనతోపాటు జీవిస్తున్న జంతువులు, చెట్లు, చేమలు, పశు పక్ష్యాదులను రక్షించే బాధ్యత మనందరిపై ఉందన్నారు. సిబ్బంది, నిధుల కొరత ఉన్నా అధిగమించి అటవీ శాఖను బలోపేతం చేస్తామని తెలిపారు. అధికారులు నిబద్ధతతో పనిచేస్తున్నారని అన్నారు. రాజకీయ నాయకులు వారి ముందర కాళ్లకు బంధాలు వేయకుండా వాళ్ల పని వాళ్లను చేసుకోనిస్తే సరిపోతుందని వ్యాఖ్యానించారు.

సంజీవని స్కీమ్‌కు నిధులు

అటవీ సంపద సంరక్షణలో ఇండియన్ ఫారెస్ట్ ఆఫీసర్ పందిళ్లపల్లి శ్రీనివాస్ సహా 23 మంది ఫారెస్ట్ అధికారులు అశువులు బాసారని చెప్పారు. గంధపు చెక్కలు, ఏనుగు దంతాల స్మగ్లర్ వీరప్పన్‌తో పోరాటం చేసి ప్రాణాలు వదిలిన శ్రీనివాస్ సహా సిబ్బంది త్యాగాలను మనతో పాటు భావి తరాలు మరిచిపోకూడదని అన్నారు. భవిష్యత్ తరాలు గుర్తించుకునేలా విగ్రహాల ఏర్పాటు, నగర వనాలు, అటవీ శాఖ భవనాలకు వారి పేర్లు పెడతామని తెలిపారు. అమరవీరుల కుటుంబాలను ఆదుకోవడానికి తీసుకొచ్చిన సంజీవని పథకానికి పారిశ్రామికవేత్తలు, దాతలతో మాట్లాడి రూ.ఐదు కోట్ల నిధులు సమీకరిస్తామని వెల్లడించారు. వాటితో అమరవీరుల స్తూపాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు.

బిష్ణోయ్ తెగలా పోరాటం చేద్దాం

చెట్లు, వన్య ప్రాణులను కాపాడుకోవడానికి బిష్ణోయ్ తెగ ఎంత వరకైనా వెళ్తుందని, జోధ్‌పూర్ రాజు చేపట్టిన చెట్ల నరికివేతకు వ్యతిరేకంగా అమృతా దేవి నాయకత్వంలో బిష్ణోయ్ తెగ శాంతియుతంగా పోరాడి వందల సంఖ్యలో ప్రాణాలను అర్పించిందని గుర్తు చేశారు. ఆ కోవకు చెందిన వ్యక్తులే మన అమరవీరులన్నారు. వీరిని స్ఫూర్తిగా తీసుకునే అటవీ సంపద సంరక్షణ కోసం సుందర్ లాల్ బహుగుణ చిప్కో ఉద్యమం చేశారని పేర్కొన్నారు. అటవీశాఖలో సంస్కరణలు తీసుకొస్తానని చెప్పారు. ఏలూరు జిల్లా ఐఎస్ జగన్నాథపురం పంచాయతీ పరిధిలో సహజ వనరులు ఇష్టారాజ్యంగా తవ్వేశారని, ఈ దోపిడీ వల్ల వ్యక్తులు బలపడుతుండగా, ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోందన్నారు. పంచాయతీలకు సీనరేజ్ రావడం లేదన్నారు. దీనిపై దృష్టి పెట్టాలన్నారు. ప్రకృతి వనరుల దోపిడీని అరికట్టేందుకు ఇప్పటికే టోల్ ఫ్రీ నంబర్ ఇచ్చామన్నారు. స్మగ్లర్ల నుంచి స్వాధీనం చేసుకున్న ఎర్రచందనాన్ని త్వరలో అంతర్జాతీయ బిడ్డింగ్ ద్వారా వేలం వేస్తామన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎమ్మెల్యేలు ఎండీ నసీర్ అహ్మద్, గళ్లా మాధవి, బి.రామాంజనేయులు, జేసీ భార్గవ్‌తేజ, నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, నగర డిప్యూటీ మేయర్ సజిల, అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ చిరంజీవి చౌదరి, ఉన్నతాధికారులు కజురియా, ఎస్ఎస్.శ్రీధర్, రాహుల్ పాండే తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు నీటికి 'అమరావతి' మెలిక

- రూ.184 కోట్లతో గుంటూరులో 'అమృత్ 2.0'
- ఆమోదానికి డీపీఆర్ పంపిన నగరపాలక సంస్థ
- అమరావతి నుంచి నీరు తేవాలని ఈఎన్‌సీ సూచన
- కృష్ణా నది ఉండగా ఇదేంటని కార్పొరేషన్ మల్లగుల్లాలు



నగరపాలక సంస్థ కార్యాలయం

నెహ్రూనగర్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అమృత్ 2.0 పథకం కింద గుంటూరు నగరపాలక సంస్థకు రూ.184 కోట్లు మంజూరయ్యాయి. వచ్చే 15 ఏళ్లలో అప్పటి జనాభాకు సరిపడా తాగునీరు అందించేందుకు వీటిని వినియోగించాల్సి ఉంటుంది. భవిష్యత్తు నీటి అవసరాలను తీర్చేందుకు చేసిన ప్రతిపాదనలతో సిద్ధమైన డీపీఆర్‌పై ఇంజినీర్ ఇన్ చీఫ్ (ఈఎన్‌సీ) స్పందిస్తూ మార్పు చేయాలని సూచించడంతో అమలు ప్రశ్నార్థకమైంది. అమృత్ 2.0 పథకంలో భాగంగా ఇంజినీరింగ్ అధికారులు భవిష్యత్తు నీటి అవసరాలకు తగ్గట్లుగా డీపీఆర్ (డిటైయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్) సిద్ధం చేశారు. దీనిని ఆమోదం నిమిత్తం ఈఎన్‌సీ, ఏపీయూఎఫ్ఐడీసీ (ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఫైనాన్స్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్)కు పంపించారు. ఈఎన్‌సీ దీనిపై అభ్యంతరాలు లేవనెత్తారు. ఉన్న వనరు కాదని ప్రత్యామ్నాయంగా అమరావతి నుంచి నీటిని గుంటూరు తీసుకువచ్చే అంశంపై దృష్టి సారించాలనడంతో కార్పొరేషన్ ఇంజినీరింగ్ అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

ప్రస్తుత పరిస్థితి ఇదీ...

గుంటూరు నగరపాలక సంస్థకు విజయవాడ కృష్ణా నది నుంచి ఉండవల్లి, మంగళగిరిల మీదుగా తక్కెళ్లపాడు హెడ్ వాటర్ వర్క్స్‌కు నీరు వస్తోంది. అక్కడి నుంచి గుంటూరు నగరానికి అవసరమైన తాగునీటిని అన్ని రిజర్వాయర్లకు డిస్ట్రిబ్యూట్ చేస్తుంటారు. ప్రస్తుతం నగర జనాభా దాదాపు 11 లక్షలు. వీరికే సరిపడా నీరు రావడం లేదనే చెప్పాలి. ప్రస్తుతం కృష్ణా నది నుంచి గుంటూరుకు వస్తున్న 149 ఎంఎల్‌డీ (మిలియన్ లీటర్స్ పర్ డే) ఏ మాత్రం సరిపోవడం లేదు. పేరుకు ఇంత వస్తున్నా పైపులైన్ల లీకేజీ, నిర్వహణ లోపాలతో 130 ఎంఎల్‌డీలే వస్తున్నట్లు సమాచారం. డీపీఆర్ ప్రకారం నగర జనాభా వచ్చే 15 ఏళ్లలో దాదాపు 20 లక్షలు అవుతుందని భావిస్తున్నారు. దానికి అనుగుణంగా మరో 75 ఎంఎల్‌డీల సామర్థ్యం పెంచేందుకు డీపీఆర్‌లో ప్రతిపాదించారు.

అదంతా పెద్ద టాస్కే...

వాస్తవానికి అమరావతి నుంచి గుంటూరుకు నీటిని తీసుకుని రావాలంటే పెద్ద టాస్కే అని చెప్పాలి. అమరావతిలో నీటి నిల్వలు తక్కువగా ఉంటాయి. ఒక వేళ రూ. కోట్లు ఖర్చు పెట్టి నీటిని తీసుకురావాలని ప్రయత్నం చేసినా సరిపడా నిల్వలు లేకపోవడం వల్ల ఆ ఖర్చు బూడిదలో పోసిన పన్నీరే అవుతుంది. ఆ ప్రయత్నం చేసినా వైకుంఠపురం వద్ద డ్యాం కట్టాల్సి ఉంది. అప్పుడు మరింత అదనపు ఖర్చు తప్పదు. గుంటూరుకు ప్రత్యామ్నాయ తాగునీటి పథకం కోసం ఈ ఆలోచన చేసే కంటే .. ఉన్న పైపులైనును, వనరులను సమర్థంగా వినియోగించడం మేలనే వాదనలు వినిపిస్తున్నాయి. డీపీఆర్ ప్రకారం ఇక్కడ 375 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన భారీ మోటార్లు రెండు ఏర్పాటు చేయనున్నారు. తక్కెళ్లపాడులో 75 ఎంఎల్‌డీలు ఫిల్టర్ అయ్యేలా ఫిల్టరేషన్ ప్లాంటు కట్టాలని కూడా డీపీఆర్‌లో ఉంది. ఈ పథకం పూర్తి స్థాయిలో అమలైతే విలీన గ్రామాలకు కూడా నీటి కష్టాలు తీరనున్నాయి. సుమారు 33 కిలోమీటర్ల మేర పైపు లైన్లు లేని చోట కొత్తగా వేయడం, అదనంగా 20 వేలకుపైగా ట్యాప్ కనెక్షన్లు ఇచ్చేందుకు కసరత్తు కొనసాగుతోంది. డీపీఆర్‌కు ఆమోదం తెలిపితే రెండేళ్లలో పనులు పూర్తి చేయనున్నారు.

భవిష్యత్తు అవసరాల కోసమే

రాబోయే 15 సంవత్సరాలలో నీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని అమృత్ 2.0 పథకం అమలుకు డీపీఆర్ సిద్ధమైంది. ఈఎన్‌సీ, ఏపీయూఎఫ్ఐడీసీకి పంపాం. వీలైనంత త్వరలో ఆమోదం పొందనుంది. రెండేళ్లలో ఈ పథకం పూర్తి చేసి ప్రతి ఇంటికి తాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– నాగ మల్లేశ్వరరావు, ఎస్ఈ, గుంటూరు కార్పొరేషన్

ఫుట్‌బాల్ టోర్నీ విజేత గుంటూరు బాలుర జట్టు

- బాలికల విభాగం విజేత అనంతపురం
- రన్నర్లుగా విశాఖ, వైఎస్సార్ కడప
- బాలికల విభాగంలో గుంటూరుకు తృతీయ స్థానం



ప్రథమ స్థానం సాధించి కప్పు అందుకుంటున్న గుంటూరు జిల్లా బాలుర జట్టు

సత్తెనపల్లి: రాష్ట్రస్థాయి అండర్ –19 ఫుట్‌బాల్ క్రీడా పోటీల్లో బాలుర విభాగంలో గుంటూరు జిల్లా, బాలికల విభాగంలో అనంతపురం జిల్లా జట్లు విజేతలుగా నిలిచాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ – గుంటూరు, ప్రగతి జూనియర్ కళాశాల సత్తెనపల్లి ఆధ్వర్యంలో 68వ రాష్ట్ర స్థాయి అండర్–19 పోటీలు పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో మూడు రోజులపాటు జరిగాయి. ఆదివారం ఫైనల్ పోటీలు జరిగాయి. బాలుర విభాగంలో ఫైనల్స్‌లోకి ప్రవేశించిన విశాఖ జిల్లా జట్టుపై గుంటూరు జిల్లా జయకేతనం ఎగురవేసింది. కర్నూలు జిల్లా జట్టు తృతీయస్థానం , విజయనగరం జిల్లా నాలుగోస్థానంలో నిలిచాయి. బాలికల విభాగంలో ఫైనల్స్‌లోకి ప్రవేశించిన వైఎస్సార్ కడప జిల్లా జట్టుపై అనంతపురం జిల్లా జట్టు విజేతగా నిలిచింది. గుంటూరు జిల్లా తృతీయ స్థానం, విశాఖపట్నం జిల్లా నాలుగోస్థానం దక్కించుకున్నాయి. విజేతలకు కప్పుతోపాటు రోలింగ్ షీల్డ్, నగదు బహుమతులను సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడాభివృద్ధికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ యెల్లినేడి రామస్వామి, నాయకులు దరువూరి నాగేశ్వరరావు, ఆళ్ల అమరేశ్వరరావు, కంభాల వెంకటేశ్వరరావు, వక్కంటి అజయ్‌కుమార్, ప్రగతి విద్యాసంస్థల అధినేత డాక్టర్ మక్కెన అచ్చయ్య, ప్రిన్సిపల్ రాయపాటి శ్రీనివాసరావు, గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి జి.నరసింహారావు, సహాయ కార్యదర్శి సీహెచ్ పద్మాకర్, ఫిజికల్ డైరెక్టర్లు ఎస్ సుధాకర్‌రెడ్డి, దాసరి కోటేశ్వరరావు, నిర్వాహకులు పుచ్చకాయల శివరామకృష్ణ, పీడీలు లాకు పిచ్చయ్య, బి అనిల్ దత్త నాయక్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కరాటేలో రాణించడం అభినందనీయం



మంగళగిరి: చిన్నతనం నుంచే కరాటేలో రాణించడం అభినందనీయమని గ్రేహౌండ్స్ అడిషనల్ ఎస్పీ, ఏపీ అసెంబ్లీ చీఫ్ మార్షల్ గణేష్‌బాబు అన్నారు. పట్టణంలోని ఈద్గా మైదానంలో ఆదివారం జపాన్ షిటోరియా కరాటే ఏపీ చాంపియన్ షిప్ – 2024ను గణేష్ బాబు ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. కరాటే వలన ఆత్మరక్షణతోపాటు మానసికంగా, శారీకరంగా బలంగా ఉండవచ్చన్నారు. ఈ పోటీలలో తమిళనాడు, కర్నాటక, తెలంగాణ, ఏపీ నుంచి 600 మంది స్టూడెంట్స్ పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఏపీ ఎండీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, డీజీపీ ఆఫీస్ పీటీఓ ఎస్పీ వాసు, ఆర్గనైజర్ డి. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు లెక్చరర్‌లను క్రమబద్ధీకరించాలి



మంగళగిరి: కాంట్రాక్ట్ లెక్చరర్లను క్రమబద్ధీకరించి, జీవోఎంఎస్ నెంబర్ 114ను వెంటనే అమలు చేయాలని ప్రభుత్వ కాలేజ్ లెక్చరర్ల అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తమ కోరిక తీరాలని ఆదివారం పట్టణంలోని శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. ప్రభుత్వం, అధికారులు తమ విజ్ఞప్తిని పట్టించుకోవడం లేదన్నారు. ఈ నెల 14 నుంచి 19వ తేదీ వరకు పసుపు రిబ్బన్లతో విధులకు హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బీఎస్ఆర్ శర్మ, పీజే గాంధీ తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు సీఐడీ కార్యాలయానికి విద్యాసాగర్

నగరంపాలెం: సినీనటి జత్వానీ కేసులో విజయవాడకు చెందిన కుక్కల విద్యాసాగర్‌ను సీఐడీ పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. ఈ మేరకు ఆదివారం ఉదయం విద్యాసాగర్‌ను గుంటూరు ప్రాంతీయ సీఐడీ కార్యాలయానికి తరలించారు. మూడు రోజుల కస్టడీలో భాగంగా అతడిని విచారించారు. సీఐడీ ఎస్పీ సరిత నేతృత్వంలో విచారిస్తున్నట్లు తెలిసింది. నటి జత్వానితో ఉన్న పరిచయం, ఇతరత్రా వివరాలను సేకరించే పనిలో వరాఉ నిమగ్నమయ్యారు. సోమ, మంగళవారాలలో కూడా దఫాలవారీగా విచారణ చేయనున్నారు.

పూర్వ విద్యార్థుల చొరవ అభినందనీయం

కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

తాడికొండ: మట్టిలో మాణిక్యాలను అందించిన తాడికొండ గురుకుల పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల చొరవ అభినందనీయమని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం పాఠశాలలలో పూర్వ విద్యార్థుల వితరణతో నిర్మించిన ప్రహరీ, ఉపాధ్యాయుల క్వార్టర్లు, అభివృద్ధి పనులను స్థానిక ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. విద్యార్థులు కలలు సాకారం చేసుకునేందుకు కృషి చేయాలన్నారు. ఎందరో ఇక్కడ చదివి ఉన్నత స్థానాల్లో ఉన్నారని గుర్తు చేవారు. పాఠశాల అభివృద్ధికి వారు కృషి చేస్తుండటం అభినందనీయం అన్నారు. ఉపాధ్యాయులు కూడా తగిన బోధన చేసి, ఉత్తమ ఫలితాలు తీసుకురావాలని సూచించారు. పదో తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు పూర్వ విద్యార్థులు ప్రకటించిన ప్రోత్సాహక నగదును మంత్రి చేతుల మీదుగా అందజేశారు. అనంతరం అతిథులను సత్కరించారు. ఏపీ గురుకులాల సొసైటీ కార్యదర్శి వీఎన్ మస్తానయ్య, తహసీల్దార్ కె నాసరయ్య, ఎంపీడీవో సమతా వాణి, ఎంఈవో తెనాలి ఇందిర, ప్రిన్సిపల్ జోగారావు, పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థికి ప్రోత్సాహక నగదు అందిస్తున్న మంత్రి పెమ్మసాని

లీగల్ విభాగం పాత్ర ఎంతో కీలకం

- కూటమి కుట్రలు అడ్డుకుందాం
- మాజీ మంత్రి విడదల రజిని

పట్నంబజారు: సోషల్ మీడియా యాక్టివిస్టులపై అక్రమ కేసుల కూటమి కుట్రలను అడ్డుకోవాల్సిన బాధ్యత న్యాయవాదులపై ఉందని మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చిలకలూరిపేట నియోజకవర్గ సమన్వయకర్త విడదల రజిని చెప్పారు. శ్యామలానగర్‌లోని తన కార్యాలయంలో ఆదివారం వైఎస్సార్ సీపీ లీగల్ విభాగం సభ్యులతో ఆమె సమావేశమయ్యారు. విడదల రజిని మాట్లాడుతూ... కూటమి నేతలు కక్షపూరితంగా వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా సభ్యులను టార్గెట్ చేసి ఒకటికి పది కేసులు నమోదు చేయటం దారుణమన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో లీగల్ విభాగం సభ్యుల పాత్ర ఎంతో కీలమన్నారు. చిలకలూరిపేటకు సంబంధించిన పెద్దిరెడ్డి సుధారాణి అంశంలో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేయటం ద్వారానే ఆమెకు ప్రాణ రక్షణ కల్పించగలిగామన్నారు. న్యాయవాదులు అండగా నిలబడటం ద్వారానే సుధారాణి, వెంకటరెడ్డి దంపతులను కాపాడుకోగలిగామని పేర్కొన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగంతో ఏకమై పోలీసులు కూడా వ్యవహరిస్తున్న తీరు ఆక్షేపణీయం అన్నారు. లీగల్ విభాగం సభ్యులు వెంటనే మరింత మంది బాధితుల పక్షాన పోరాడేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. పార్టీ లీగల్ విభాగం కోర్ కమిటీ సభ్యులు పోలూరి వెంకటరెడ్డి మాట్లాడుతూ... ప్రస్తుతం పోలీసులు వ్యవహరిస్తున్న తీరు అత్యంత ఘోరంగా ఉందన్నారు. మహిళ అయిన సుధారాణికి జరిగిన అన్యాయంపై మాజీ మంత్రి రజినికి వివరించారు. ఆమె భర్త వెంకటరెడ్డి ప్రమేయం లేకపోయినా.. అక్రమంగా ఇరికించారని తెలియజేశారు. ఏ ఒక్క ఫిర్యాదులో కూడా వెంకటరెడ్డి పాత్ర లేకపోయినా. ఫిర్యాదుదారుడు కూడా ఏమీ చెప్పకపోయినా అక్రమంగా రిమాండ్ రిపోర్టులో సుధారాణి భర్త పేరు చేర్చినట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ లీగల్ విభాగం జిల్లా అధ్యక్షుడు సీడీ భగవాన్, మొండితోక శ్రీనివాసరావు, రమణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



లీగల్ విభాగం సభ్యులతో సమావేశమైన రజిని

కుక్కల దాడిలో ఎనిమిది మందికి గాయాలు

తెనాలి రూరల్: పట్టణంలో వీధి కుక్కలు స్వైర విహారం చేశాయి. కనబడిన వారి మీదల్లా దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. తెనాలి పట్టణంతోపాటు పరిసర ప్రాంతాల్లో ఆదివారం ఉదయం వీధి కుక్కలు దాడి చేయడంతో ఎనిమిది మంది గాయపడ్డారు. బాధితులు తెనాలి ప్రభుత్వాస్పత్రికి క్యూ కట్టారు. ఇంటి ముందు ఆడుకుంటున్న చిన్నారులతోపాటు పెద్దవాళ్లనూ కుక్కలు కరిచాయి. బాలాజీరావుపేట, యడ్ల లింగయ్య కాలనీ, గంగానమ్మపేట, కఠెవరం, అలాగే బాపట్ల జిల్లా చుండూరు మండలం వలివేరు ప్రాంతాల్లో కుక్కలు ప్రజలను తీవ్రంగా గాయపరిచాయి. బాధితుల్లో గంగానమ్మపేటకు చెందిన పిచ్చియ్య, బాలాజీరావు పేట ప్రాంతానికి చెందిన శ్రీరామకృష్ణ, రాజశేఖర్, పద్మావతి, శివమ్మ, వలివేరుకు చెందిన సామ్రాజ్యం, కఠెవరానికి చెందిన చిన్నారులు షణ్ముఖరావు, టి. ప్రైయిసీలు ఉన్నారు. వీధి కుక్కల్ని పట్టుకోవడంలో పురపాలక సంఘం, పంచాయతీ అధికారుల తీవ్ర నిర్లక్ష్యం వల్లే తమ ప్రాణాల మీదకు వచ్చిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఆసుపత్రిలో బాధిత చిన్నారి

నేడు ఇద్దరు ఉపాధ్యాయులకు పురస్కారాల ప్రదానం

గుంటూరు ఎడ్యుకేషన్: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా సెప్టెంబర్ ఐదో తేదీన జరగాల్సిన ఉపాధ్యాయ దినోత్సవాన్ని సోమవారం విజయవాడ లబ్బీపేటలోని ఏ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించనున్నారు. గుంటూరు జిల్లా నుంచి ఎంపికైన రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులు కార్యక్రమానికి హాజరు కావాలని డీఈవో సీవీ రేణుక ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికైన పొన్నూరు మండలం మామిళ్లపల్లి ఎంపీయూపీఎస్ స్కూల్ అసిస్టెంట్ అయిన గణితశాస్త్ర ఉపాధ్యాయుడు చెన్నంశెట్టి రమేష్, కొల్లిపరలోని ఎంపీపీ స్కూల్ ఎస్జీటీ పెనుమూడి మృత్యుంజయరావులకు డీఈవో అభినందనలు తెలియజేశారు. వీరు సోమవారం ఉదయం 6 గంటలకు ఏ కన్వెన్షన్‌లో రిపోర్టు చేయాలని సూచించారు.

అంబులెన్స్ వెళ్లేలా చర్యలు తీసుకున్నాం

ఏఎస్పీ రమణమూర్తి

నగరంపాలెం: పోలీస్ శాఖ సకాలంలో స్పందించి అంబులెన్స్ వెళ్లేలా చర్యలు తీసుకున్నామని జిల్లా ఏఎస్పీ రమణమూర్తి (పరిపాలన) ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసుపత్రికి వెళ్తున్న అంబులెన్స్‌కు అరణ్య భవన్ వద్ద ఎటువంటి అడ్డంకులు ఏర్పడలేదని తెలిపారు. వ్యక్తి అనారోగ్య పరిస్థితి దృష్ట్యా అత్యవసరంగా సీపీఆర్ చికిత్స అందించేందుకు వైద్య సిబ్బంది అంబులెన్స్‌ను ఆపారని పేర్కొన్నారు. ఎటువంటి ట్రాఫిక్ అంతరాయం కలగలేదన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పర్యటన దృష్ట్యా పోలీస్ శాఖ అరణ్య భవన్ ముందు రోడ్డులో ఎటువంటి ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీవీఐపీ, వీఐపీ పర్యటనల్లో అంబులెన్స్, అత్యవసర సేవల వాహనాలకు తప్పనిసరిగా దారి ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

ఉత్సాహంగా కర్రసాము పోటీలు



విజేతలతో తులసి రామచంద్రప్రభు తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో ఆదివారం సౌత్ ఇండియా స్థాయి సిలంబం పోటీలను టీజేపీఎస్ కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం ప్రారంభించారు. ఈ సందర్భంగా పోటీల నిర్వహణకు రూ.2.50 లక్షలను తులసి సీడ్స్ యాజమాన్యం సమకూర్చింది. పోటీలు ఆద్యంతం ఉత్సాహంగా జరిగాయి. విజేతలకు ముఖ్య అతిథి తులసి రామచంద్ర ప్రభు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్యక్రమ నిర్వహణను విజయవంతంగా పూర్తి చేశామని తెలిపారు. కర్రసాము కోచ్ వర్మ, గ్రాండ్ మాస్టర్ జిడుగు సుబ్బారావులను అభినందించారు. తనకు కర్రసాము వచ్చని, ఇది కనుమరుగు కాకూడదనే కార్యక్రమ ఏర్పాటుకు సహకారం అందించామన్నారు. ఆంధ్ర, తెలంగాణ, కేరళ, తమిళనాడు నుంచి 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఉగ్గిరాల సీతారామయ్య, దళవాయి సుబ్రహ్మణ్యం, సిద్ధార్థ వర్మ, సుధీర్, సుమంత్, ఆర్ఆర్ఆర్ శర్మ, క్రీడాకారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ నిధులతో దళితులకు వసతులు



తాడేపల్లి రూరల్: మాదిగ కార్పొరేషన్ నిధులతో దళితులకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి తెలిపారు. ఆదివారం ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి బైపాస్‌రోడ్‌లోని మాదిగ కార్పొరేషన్ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ ... తనకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. రిజర్వేషన్ల కారణంగానే తాము ఈ స్థితిలో ఉన్నామని చెప్పారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో దళితులకు పలు పథకాలు నిలిపివేశారని ఆరోపించారు. అమరావతి అభివృద్ధి చెందితే దళితులకు ఉద్యోగాలు వస్తాయన్నారు. దళితులకు ఎన్టీఆర్, చంద్రబాబులు మాత్రమే న్యాయం చేశారని అన్నారు.

విజయనగర శాసనం లభ్యం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఎంతో చారిత్రక ప్రాధాన్యం ఉన్న క్రీస్తు శకం 15వ శతాబ్దానికి చెందిన విజయనగర శాసనాన్ని పరిరక్షించాలని పురావస్తు పరిశోధకుడు, ది కల్చరల్ సెంటర్ ఆఫ్ విజయవాడ అండ్ అమరావతి (సీసీవీఏ), ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సంస్థ సీఈఓ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ మధుచౌక్‌లోని సీసీవీఏ కార్యాలయం ఆవరణలో శివనాగిరెడ్డి ఆదివారం విలేకరులతో మాట్లాడారు. బాపట్ల జిల్లాలో ఆదివారం పర్యటించామని చెప్పారు. మార్టూరు పట్టణంలోని పాత శివాలయం ముందు ఉన్న మురుగు కాలువలో క్రీస్తు శకం 15వ శతాబ్దానికి చెందిన శాసనం ఉందన్నారు. క్రీస్తు శకం 1453లో విజయ నగర చక్రవర్తి మల్లికార్జున రాయలు స్థానిక సోమనాథ దేవాలయ నిర్వహణకు చేసిన సహాయ వివరాలతోపాటుగా ఆ గ్రామ చరిత్రకు సంబంధించిన విషయాలు ఈ శాసనంలో ఉన్నాయని చెప్పారు. శాసనాన్ని పాత శివాలయం ఆవరణలో భద్రపరచడంతోపాటుగా ఆ వివరాలను ప్రజలకు తెలిసేలా ప్రత్యేకంగా బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. మణిమేల శివశంకర్, భాగవతం వెంకటనారాయణాచార్యులు, కందుకూరి చరణ్, గుత్తి నాగవంశీ, శరత్ తనకు సహకరించారన్నారు.



శాసనాన్ని పరిశీలిస్తున్న శివనాగిరెడ్డి తదితరులు

హోరాహోరీగా బేస్‌బాల్ పోటీలు

ప్రత్తిపాడు: మండలంలోని యనమదల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి 68వ ఏపీ ఎస్‌జీఎఫ్ ఇంటర్ డిస్ట్రిక్ట్ బేస్‌బాల్ టోర్నమెంట్ కం సెలక్షన్లు ఉత్సాహంగా సాగుతున్నాయి. రెండవ రోజైన ఆదివారం అండర్-17 బాలుర, బాలికల విభాగాల్లో పోటీలు హోరాహోరీగా జరిగాయి. 13 జిల్లాల నుంచి 26 జట్లు తలపడ్డాయి. తర్వాత క్రీడాకారులతో క్యాంప్‌ఫైర్ నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. పాఠశాల హెచ్ఎం ఎం. నాగేశ్వరరావు, ఎస్ఎంసీ చైర్మన్ చౌదరిబాబు, రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు సెంటినియల్ సుబ్రమణ్యం, ఎస్‌జీఎఫ్ మాజీ సెక్రటరీలు మస్తాన్‌రెడ్డి, సీనియర్ క్రీడాకారులు జగదీశ్వర్‌రెడ్డి పోటీలను పర్యవేక్షించారు.

విజేతలు వీరే...

విజేతల వివరాలను పోటీల అబ్జర్వర్ శ్రీకాంత్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ బి. గంగాధరరావులు సంయుక్తంగా ప్రకటించారు.

బాలికల విభాగంలో..

అనంతపురం జిల్లా జట్టుపై ప్రకాశం జిల్లా జట్టు 0–10 తేడాతో గెలిచింది. కడపపై గుంటూరు 0–5 తేడాతో, చిత్తూరుపై శ్రీకాకుళం 0–6, విజయనగరంపై కర్నూలు 1–3 తేడాతో విజయం సాధించాయి.

బాలుర విభాగంలో..

గుంటూరుపై 5–6 తేడాతో విజయనగరం, కృష్ణాపై ప్రకాశం 1–6 తేడాతో, విశాఖపట్నంపై కర్నూలు 2–4 తేడాతో, కడపపై శ్రీకాకుళం 4–5 తేడాతో విజయం సాధించాయి.



అండర్-17 బాలుర విభాగంలో తలపడుతున్న క్రీడాకారులు

విద్యుత్ చార్జీల భారం ఉపసంహరించుకోవాలి

సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు వి. కృష్ణయ్య

తాడేపల్లి రూరల్: విద్యుత్తు ట్రూఅప్ చార్జీల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై భారం వేయడాన్ని ఉపసంహరించుకోవాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు వి. కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఆదివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని ముగ్గురోడ్డు, పోతురాజుస్వామి గుడి, రన్నింగ్ రూమ్ ప్రాంతాల్లో సీపీఎం ప్రజాపోరు ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వి. కృష్ణయ్య మాట్లాడుతూ.. తాము అధికారంలోకి వస్తే కరెంటు చార్జీలు పెంచబోమని చెప్పిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు రూ.18 వేల కోట్ల భారం మోపుతోందని విమర్శించారు. ఉచిత ఇసుక విధానం అమలులోకి రాలేదని ఆరోపించారు. భవన నిర్మాణ కార్మికులకు పనులు లేకుండా పోయాయని విమర్శించారు. రాష్ట్రంలో మహిళలు, బాలికలపై అత్యాచారాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సీపీఎం పట్టణ కార్యదర్శి బూరగ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీన తాడేపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నాలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి, సుబ్బారెడ్డి, దర్శన విజయబాబు, కోట బాబూరావు, రామారావు, తులసీరావు, లీలమ్మ, శ్రీనివాసరావు, బి. అంజిరెడ్డి, ఫిరోజ్, సుభాని, ఆదాం, కొట్టే కరుణాకరరావు, ఎస్. గిరిజ, సీహెచ్ భుజంగరావు, పద్మ, భవాని, ఖాజావలి, బొబ్బిలి రామారావు, సత్యం, జ్యోతి, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న కృష్ణయ్య

వ్యక్తి దారుణ హత్య

పొన్నూరు: మండలంలోని ములుకుదురు గ్రామంలో వ్యక్తి దారుణ హత్యకు గురైన సంఘటన ఆదివారం జరిగింది. పోలీసుల నుంచి సేకరించిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నక్కల దేవరాజ్(36) ఎలక్ట్రీషియన్‌గా జీవనం సాగిస్తున్నాడు. శనివారం రాత్రి ఇంటి నుంచి బయటికి వెళ్లిన దేవరాజ్ గ్రామ సమీపంలో హత్యకు గురయ్యాడు. వివాహేతర సంబంధమే దీనికి కారణమని సమాచారం. నిందితులను వెంటనే అరెస్టు చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని బంధువులు, దళిత సంఘాల నాయకులు బాపట్ల ప్రధాన రహదారిపై ఆందోళన చేశారు. సమాచారం తెలుసుకున్న తెనాలి డీఎస్పీ జనార్దనరావు, రూరల్ సీఐ కోటేశ్వరరావు, రూరల్ ఎస్ఐ కిరణ్‌బాబులు హత్య జరిగిన ప్రదేశాన్ని పరిశీలించి, విచారణ చేపట్టారు. ఈ కేసులో పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.



దేవరాజ్ మృతదేహం



బంధువులతో మాట్లాడుతున్న డీఎస్పీ జనార్దనరావు

పోలీసులపై చర్యలు తీసుకోవాలి

లక్ష్మీపురం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కార్యకర్త సుధారాణిపై పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించారని, వారిపై శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని కమ్యూనిస్టు ఇండియా జాతీయ కార్యదర్శి తోట సంగమేశ్వరరావు (సంగమ్) ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పది రోజుల తరువాత నుంచి పరిస్థితి దిగజారిందని, రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. అది మాత్రమే ప్రస్తుత సమస్యలకు తక్షణ పరిష్కారమని అన్నారు.